# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 84 | విశాఖపట్నం | 24-12-2025 బుధవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 84 | VISAKHAPATNAM | 24-12-2025 WEDNESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


### ఆధునిక పరిశోధనల కేంద్రంగా

# అమరావతి క్వాంటమ్ వ్యాలీ: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రస్తుతం అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆధునిక పరిశోధనల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందని చెప్పారు. దేశంలోనే తొలిసారి అతిపెద్ద క్వాంటమ్ విద్యాసదస్సు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్య కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వేలాది టెక్ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో 'క్వాంటమ్ టాక్' నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ పని చేయబోతోందన్నారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్వాంటమ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం 50 వేల మంది విద్యార్థులు, ఐటీ రంగ ఉద్యోగులు రిజిష్టర్ చేసుకున్నారు. వీరిలో 51 శాతానికి పైగా మహిళా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్ మ్యాప్?ను సీఎం చంద్రబాబు విద్యార్థులకు వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 3 వేల మందికి తదుపరి స్థాయి శిక్షణ, వంద మందికి ఐబీఎం, టీసీఎస్? సహా సీడాక్?లో శిక్షణ అవకాశాలు లభించాయి. ఏపీ నుంచి లక్ష మంది క్వాంటమ్ నిపుణుల్ని తయారు చేయడమే లక్ష్యంగా క్వాంటమ్ ప్రోగ్రామ్ పని చేయనుందని సీఎం వెల్లడించారు. 1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిందని, 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయన్నారు. ఆ తర్వాత ఎక్కడా వెనక్కి తిరిగి చూడలేదని తెలిపారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలతో ఆర్థికాభివృద్ధికి ముందడుగు పడిందని సీఎం అన్నారు. హరిత విప్లవంతో దేశ స్థితిగతులు సమూలంగా మారాయని, ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందని చంద్రబాబు వివరించారు. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోందని, విశాఖకు చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోందని, తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీని క్వాంటమ్‌తో పాటు గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తున్నామని సీఎం అన్నారు. వచ్చే 20 ఏళ్లలో రాష్ట్రాభివృద్ధిపై ఇప్పుడే కార్యరూపం ఇస్తున్నామన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఒక ఎకో సిస్టమ్ తయారీ లక్ష్యమని, హరిత, పారిశ్రామిక విప్లవాల కంటే టెక్నాలజీతో సేవల రంగంలో విప్లవం సాధించామని పేర్కొన్నారు. అమరావతి నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీగా ఉంటుందన్నారు. అనంతపురం, కడప ఎలక్ట్రానిక్స్ ఏరో స్పేస్ కేంద్రాలుగా ఉంటాయన్నారు. అతిపెద్ద పారిశ్రామిక కారిడార్లుగా విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు మారబోతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా సంస్కరణలతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామన్నారు. (తరువాయి 2వ పేజీలో)

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

### 4 చోట్ల క్రిమినల్ కేసులు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఆకస్మిక తనిఖీల్లో 4 చోట్ల క్రిమినల్ కేసులు ఏసీబీ అధికారులు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి చెందిన 14 ఇళ్లలో సోదాలు చేపట్టారు. నవంబరు 5, 6 తేదీల్లోనూ పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. గత నెలలో సిబ్బంది నుంచి అధికారులు పెద్దమొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ జగదాంబ సెంటర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ మోహనరావు, ఇద్దరు సిబ్బంది ఇళ్లలో సోదాలు చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ, ఐదుగురు సిబ్బంది ఇళ్లలో సోదాలు నిర్వహించగా అనంతపురం జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కేసు నమోదు చేశారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ ప్రసాద్‌బాబు, ఇతరులపై ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కూడా కేసు నమోదు చేశారు. ఇన్‌ఛార్జ్ సబ్‌రిజిస్ట్రార్ షేక్ మహమూద్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో విజయనగరం జిల్లా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ సహా ఆరుగురు సిబ్బంది ఇళ్లలో తనిఖీలు చేసి పలు కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార విధులు నిర్వహించే కనకరాజు ఇంటి నుంచి రూ.15 లక్షలు నగదు, 12 బ్యాంక్ పాసు పుస్తకాలతో పాటు ఆస్తుల దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు.



## విటమిన్ 'డి' లోపంతో ఆరోగ్య సమస్యలు ఎలా ఉంటాయో తెలుసా?

6లో

## గోడను ఢీకొట్టిన బైక్..

## ముగ్గురు యువకులు మృతి



**పశ్చిమగోదావరి, పతాకం న్యూస్:** అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పోలమూరు గ్రామంలో జరిగింది. ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో పోలమూరులో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం (తరువాయి 2వ పేజీలో)

### విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్స లక్ష్యంగా

# పీపీపీ విధానం: సత్యకుమార్



**విజయవాడ, పతాకం న్యూస్:** ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల బాలికల నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి జగన్ రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదని.. నిధులు ఇవ్వని వ్యక్తికి పీపీపీ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. ఈ కళాశాల వసతి గృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారని విమర్శించారు. విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందన్నారు. 80 శాతం పూర్తైన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు. త్వరలో మొత్తం 5 ఫ్లోర్లను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సిద్ధార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 2017లోనే రూ.21 కోట్లు నిధులు మంజూరు చేశారని.. గత ప్రభుత్వం నిధులు నిలిపివేయటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్పిటల్‌కు కావలసిన నిధులను చంద్రబాబు, మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సకు పూర్తి సౌకర్యాలతో ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



**మల్కాన్‌గిరి, పతాకం న్యూస్:** ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్ గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే-47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది.

తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.



## సంక్షోభంలో జీడి పరిశ్రమ!

5లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పేదరికం

2025లో ప్రపంచబ్యాంక్ ప్రపంచంలో నిరుపేదల సంఖ్య, అంటే బొత్తిగా ఏమీ లేనివారి సంఖ్య చాలా వేగంగా తగ్గిపోతున్నదంటూ ప్రకటించింది. ఈ తగ్గుదల ప్రత్యేకించి ఆసియా ఖండంలో ఎక్కువగా జరిగినట్టు తెలిపింది. దీనిని ఆధారం చేసుకుని ఇప్పటికే చాలా ప్రచారం జరిగింది. ప్రపంచబ్యాంక్ ప్రకటించినదే నిజం అయితే అది చాలా ఆనందాన్ని కలిగించే విషయమే. కాని ఆ ప్రకటన వాస్తవం కాదు. ఈ బూటకపు ప్రకటన ప్రపంచబ్యాంక్, ప్రభుత్వాలు గత కొన్ని దశాబ్దాలుగా ఆచరిస్తున్న గణాంకాల తారుమారు నుంచి పుట్టుకొచ్చింది. ఈ తప్పుడు పద్ధతి మీద ఎన్ని విమర్శలు వచ్చినా వాళ్ళకి ఖాతరు లేదు. గత 50 సంవత్సరాలుగా పేదలు చేసే ఖర్చు స్థాయిని తక్కువ చేసి చూపిస్తున్నారు. అంటే, ఆ కనీస స్థాయి ఖర్చు కన్నా ఎక్కువ ఖర్చు చేస్తున్న వారంతా పేదరికంలో లేనట్టే లెక్క. అందుచేత ఆ స్థాయిని ఎంత తక్కువగా చూపితే పేదరికం అంత తక్కువగా ఉన్నట్టు చెప్పుకోవచ్చు. ఈ కనీస స్థాయిని కూడా క్రమంగా తగ్గిస్తూ వచ్చారు. ఇప్పుడు అది ఎక్కడిదాకా వచ్చిందంటే మనిషన్నవాడెవడూ అంత తక్కువ ఖర్చుతో బతకడం అసాధ్యం. ఇండియాలో నిరు పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటిం చింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022-23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. ఈ సొమ్ముతో గ్రామాల్లో 2.9 లీటర్ల నీరు మాత్రమే వస్తుంది. అదే పట్టణాల్లో 3.5 లీటర్ల నీరు మాత్రం కొనగలుగుతారు. పేదరిక స్థాయి నిర్ధారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చిపూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లైనా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. "సామర్థ్యాన్ని పెంపొందించే శిక్షణ" పేరుతో మూడవ ప్రపంచ దేశాలలోని ఆర్థికవేత్తలకు పేదరికపు అంచనాల మీద శిక్షణ నివ్వడానికి ప్రపంచ బ్యాంక్ తన సలహాదారులను పంపుతోంది. వీళ్ల సలహా మేరకు చైనాలో పేదరికపు స్థాయిని నిర్ణయించారు. అక్కడ 1978 నాటి ధరల ప్రకారం ఏడాదికి 100 యువాన్లు వస్తే పేదరికంలో లేనట్టే లెక్క. దానిని 1997 ధరల స్థాయికి సవరించి, ఆహారేతర ఖర్చులను కూడా కలిపి రోజుకు తలసరి ఆదాయం 8.8 యువాన్లుగా తేల్చారు. ఆ సొమ్ముతో కేవలం 2.1 లీటర్ల మంచి నీరు మాత్రమే వస్తుంది. 2019 నాటికి ఈ ప్రాతిపదికన చైనాలో అసలు నిరుపేదలే లేకుండా పోయారు. దీనిని ఒక విజయంగా ప్రపంచబ్యాంక్ ప్రచారం చేసింది. ఆ తర్వాత 2020లో కనీస స్థాయిని 11 యువాన్లకు పెంచారు. విశ్లేషకుల అంచనాల ప్రకారం ఇప్పటికీ చైనాలో కనీస స్థాయిలో జీవించాలంటే నెలకు తలసరి ఆదాయం కనీసం 1000 యువాన్లు ఉండాలి. అధికారిక పేదరికపు స్థాయి కన్నా ఇది మూడు రెట్లు ఎక్కువ. ఈ మాత్రం ఖర్చు చేయలేని స్థితిలో ఉన్నవారు నేటికీ చైనా జనాభాలో ఐదో వంతు ఉన్నారు. అందుచేత అక్కడ నిరుపేదలు సున్నా శాతం అని, ఇండియాలో 5 శాతం అని చెప్పుకోవడం ఒట్టిమాటే. అయితే, ఇటీవల చైనాలో శిక్షణ పొందిన పలువురు కార్యకర్తలను వేలాదిమందిని గ్రామీణ ప్రాంతాలకు పంపి అక్కడి ప్రజలు వాస్తవంగా గడుపుతున్న జీవనాన్ని పరిశీలించి నిరుపేదలుగా ఉన్నవారిని స్థానిక సంఘాల సహాయంతో గుర్తించి వారికి భారీ మొత్తాలను సహాయంగా అందించి వాళ్ళు పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టింది. ఒకమేరకు అదే విధమైన పద్ధతిలో ఇక్కడ కేరళలో ప్రభుత్వం వలంటీర్ల, స్వచ్ఛంద సంస్థల నెట్‌వర్క్ సహాయంతో దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో జయప్రదం అయింది. ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది! ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని ఎందుకింత హీనమైన స్థాయికి దిగజార్చుతున్నారు? ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా ఎందుకిలా చేస్తున్నారు? చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఈ పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని పౌష్టికాహార లభ్యత అన్న అంశంతో విడగొట్టి లెక్కించడం మొదలుపెట్టాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే జరుగుతోంది.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని పెద్ద పులి మృతి

**గుంటూరు, పతాకం న్యూస్:** గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దపులి మృతి చెందిన ఘటన అర్ధరాత్రి వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. 565 జాతీయ రహదారిపై నిన్న అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో పెద్ద పులి మరణించడంతో విషయం తెలుసుకున్న అటవీ శాఖ పోలీస్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పులి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న సిరిగిరిపాడు గ్రామస్తులు పెద్దపులిని చూసేందుకు వందలాదిమందిగా వచ్చారు. దీంతో ఫారెస్ట్ అటవీ పోలీస్ అధికారులు పులి దగ్గరికి ఎవరినీ వెళ్లనీయకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు.

## మట్టం భీమవరం-వై.రామవరం రోడ్డు యొక్క దయనీయ దుస్థితి




**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం పరిధిలోని మట్టం భీమవరం గ్రామం నుండి వై.రామవరం వరకు ఉన్న రహదారి తీవ్ర దుస్థితిలో ఉంది.ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలమై, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.ఈ రోడ్డు మీదుగానే మండల కేంద్రం అయిన కొయ్యూరు వెళ్లి రావాల్సి వస్తోందని,అయితే ప్రస్తుతం రోడ్డు దారుణంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని, అదే విధంగా జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 250 కిలోమీటర్లు ఈ దెబ్బతిన్న రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.రోడ్డు దుస్థితి కారణంగా విద్యార్థులు,రోగులు,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రులకు వెళ్లాలన్నా తీవ్ర ఆలస్యం జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని తెలిపారు.కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మట్టం భీమవరం%-%వై.రామవరం రోడ్డును పునర్నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మైభారత్ బ్లాక్ లెవల్ క్రీడలు విజయవంతం




**అనంతగిరి, పతాకం న్యూస్:** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న మైభారత్ కార్యక్రమం ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో బ్లాక్ స్థాయి క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి.వాలీబాల్, రన్నింగ్, హ్యాండ్ బాల్, కబడ్డీ అంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 100 మంది యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.విజేతలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె. ప్రమీల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.మైభారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో క్రీడా దిశగా ఆసక్తి పెంచడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా, విశాఖపట్నం నుంచి వచ్చిన మైభారత్ బృందంచే గెలుపొందిన యువతకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సి.హెచ్. అనిల్ కుమార్, పి.ఎస్. నాగు, ఎం. తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ విభజన వద్దు సమిష్టి నిర్ణయమే మేలు విభజించి పాలించవద్దు : సర్పంచ్ లలిత

**చింతపల్లి, పతాకం న్యూస్:** పంచాయతీ విభజన ను తామంతా వ్యతిరేకిస్తున్నామని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మెల లలిత, ఆ పంచాయతీ వార్డు సభ్యులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ముక్త కంఠంతో అన్నారు. ఆ పంచాయతీ కార్యదర్శి ఆర్ విజయశాంతి సమక్షంలో ఆదివారం సమావేశమైన పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పంచాయతీ విభజన ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసుకున్నట్లు సర్పంచ్ లలిత సోమవారం వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ విభజన వలన అనేక సమస్యలు ఉత్పన్నం అవుతుండడం వలన విభజన నిర్ణయాన్ని పంచాయతీ పాలక వర్గంతో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలు అభిప్రాయం మేరకు విభజన నిర్ణయాన్ని తామంతా వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.పంచాయతీ వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## జనవరి 2 నుండి టోకెన్లు లేకపోయినా దర్శనానికి అనుమతిస్తాం : టీటీడీ చైర్మన్ నాయుడు



**తిరుపతి, పతాకం న్యూస్:** 2వ తేదీ నుంచి టోకెన్లు లేకపోయినా తిరుమల దర్శనానికి అనుమతిస్తున్నామని టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. మంగళవారం తిరుమల క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్.నాయుడు మాట్లాడుతూ డిసెంబరు 30వ తేదీ నుంచి జనవరి 8 వ తేదీ వరకు జరిగే వైకుంఠ ద్వార దర్శనాలకు రెండు నెలలగా అధికారులు పనిచేస్తున్నారని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కూడా సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. మంత్రులు కూడా టిటిడితో నిరంతరం సమీక్షిస్తున్నారని చెప్పారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి సామాజిక మాధ్యమాల ట్రోల్స్ పై బిఆర్ నాయుడు స్పందించారు. టికెట్, టోకెన్లు లేని వారికి తిరుమలలో అనుమతి లేదంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, అలాంటి ప్రచారాలను నమ్మవద్దని యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. తిరుమలకు యాత్రికుల అనుమతిని నిరాకరించడంపై ఎవరికీ హక్కు లేదు అని అన్నారు. టోకెన్లు కలిగిన యాత్రికులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తామని చెప్పామన్నారు. 2వ తేదీ నుంచి టోకెన్లు లేకపోయినా దర్శనానికి అనుమతిస్తున్నామని తెలిపారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం కుట్ర: పోతురాజు

**పాడేరు, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ను పటిష్టంగా అమలు చేయాలని, దాన్ని బలహీనపరిచే ఏ చర్యలు తీసుకోకూడదని ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. పోతురాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ 2005లో వామపక్ష పార్టీల ఉద్యమం, ప్రజా ఒత్తిడి వల్లే ఈ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు గత 20 సంవత్సరాలుగా గణనీయమైన ఉపయోగం జరిగిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం భూస్వాములు, పెత్తందారుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఈ వైఖరిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు ప్రధాన డిమాండ్లు ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలి, అర్హులైన పేదలందరికీ పని హక్కు కల్పించాలి, సంవత్సరానికి 200 రోజుల పని హామీ ఇవ్వాలి కూలి రేటును కనీసం రూ.600కి పెంచాలి. పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, ఆరుబయట రక్షణ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## అమరావతి క్వాంటమ్ వ్యాలీ

డిజిటల్ ఇండియా, జీఎస్టీ లాంటి సంస్కరణలతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నట్లు సీఎం వివరించారు. రూ.వంద కోట్లు నజరానా: క్వాంటం టెక్నాలజీ ద్వారా ఎవరైనా నోబుల్ ప్రైజ్ అందిపుచ్చుకుంటే వారికి వంద కోట్లు నజరానా ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్, క్యురేటివ్ హెల్త్‌ను క్వాంటం అప్లికేషన్ల ద్వారా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సామర్థ్యాలు, వేగం, కచ్చితత్వం లాంటివి క్వాంటం టెక్నాలజీ ద్వారా సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఓ ట్రాన్స్‌ఫర్మేషనల్ ఛేంజ్ క్వాంటం ద్వారా సాధించేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ ను భారతీయులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఏ సాంకేతికత అయినా విప్లవమైనా ఏపీ సారథ్యం వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రస్తుతం అందరూ క్వాంటమ్ గురించే ఆలోచిస్తున్నారు. డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. అమెరికాకు సిలికాన్ వ్యాలీ మాదిరిగానే భారత్‌కు క్వాంటమ్ వ్యాలీ. క్వాంటమ్ వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయులే, అందులో ఏపీ నుంచి వెళ్లిన వారే అధికంగా ఉన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో మనదేశం అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది, 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందని చంద్రబాబు తెలిపారు. కుటుంబానికి ఒక ఐటీ నిపుణుడు: సైబరాబాద్ నిర్మాణం ద్వారా హైదరాబాద్ ఐటీ గ్లోబల్ హబ్‌గా ఎదిగిందని, విశాఖలోనూ ఇప్పుడు గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోందన్నారు. గతంలో ఐటీఈఎస్ లాంటి సేవలను వివిధ దేశాలకు ఇక్కడినుంచే అందించామన్నారు. ఇప్పుడు కూడా అలాగే ఇక్కడ నుంచే సీ కేబుల్ లాంటి వ్యవస్థ కూడా ఏర్పాటవుతుందన్నారు. 30 ఏళ్ల క్రితం ప్రతి కుటుంబం నుంచి ఒక ఐటీ నిపుణుడు ఉండాలని పిలుపునిచ్చానని, ఆ విజన్‌కు ముందుకొచ్చారు, ఇవాళ వారంతా సంతోషంగా ఉన్నారన్నారు. క్వాంటమ్ టాక్ కార్యక్రమంలో వైసర్ క్యూబిక్ సంస్థల ప్రతినిధులు, వేలాది మంది టెక్ విద్యార్థులు వర్చువల్ గా హాజరయ్యారు. ఐఐటీ చెన్నై, తిరుపతి డైరెక్టర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి క్వాంటమ్ టెక్నాలజీలో చేపట్టబోయే ప్రాజెక్టులను వైసర్, క్యూబిక్ సంస్థల ప్రతినిధులు విద్యార్థులతో పంచుకున్నారు. క్వాంటమ్ టెక్నాలజీతో భవిష్యత్తులో రాబోయే మార్పులను ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి వివరించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఏర్పాటుకు వేగంగా చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. నేషనల్ క్వాంటమ్ మిషన్ తరపున ఏపీలోని ఇంజినీరింగ్ కళాశాలకు టీచింగ్ ల్యాబ్?ల ఏర్పాటులో తోడ్పాటు అందిస్తామని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి అభయ్ కరాందికార్ తెలిపారు.

## ముగ్గురు యువకులు మృతి

మేరకు అర్ధరాత్రి 12 గంటల 30 నిముషాల సమయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళుతుండగా బైక్ అతి వేగంతో వెళ్లి అదుపుతప్పింది. రోడ్డు ఖాళీగా ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి 'టిప్ టాప్' షాప్ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలంలోనే ఇద్దరు యువకులు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు కొల్లు సత్యనారాయణ (28), యేలేటి అంజిబాబు (25), యేలేటి రాజు (19) గా గుర్తించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. యువతకు శక్తివంతమైన బైకులు ఇచ్చేముందు తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకొని సరైన పర్యవేక్షణ కల్పించాలని హితవు పలికారు.

# వాటర్ షెడ్ పను పరిశీలించిన ఐటీడీవో పీవో శ్రీపూజ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** వాటర్‌షెడ్ పథకం ముఖ్యోద్దేశానికి తగినట్టుగా రైతులను చైతన్యపరిచి సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. మండలంలోని పలు పంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకం కింద రూ.3.76 కోట్లతో చేపట్టిన 158 పనులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఆమె మంప పంచాయతీలో పర్యటించారు. మధ్యాహ్నం ఆ పంచాయతీ పరిధిలోని కింంచెవానిపాలెం, మంప, గంగవరం, నగరంలో చేపట్టిన పలు చెరువులు, నీటికుంటల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తవ్విన చెరువుల విస్తీర్ణం, వాటి ద్వారా ఎంత మంది రైతులకు ఎంత మేర భూములకు సాగునీరందుతుంది?, సీజన్ అనంతరం ఈ చెరువుల ద్వారా రైతాంగానికి అదనంగా ఆదాయం రావడానికి ఏ విధమైన చర్యలు తీసుకున్నారు? తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే చెరువు గట్లు పటిష్ఠంగా ఉండేందుకు వీలుగా ఏ మేరకు పండ్ల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు?, తదితర విషయాలపై రికార్డుల పరంగా పరిశీలించారు. అనంతరం మంపలోని అల్లూరి స్మారక మందిరాలను సందర్శించి దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం ఉన్న పరిస్థితి, అదనంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమీపంలో అల్లూరి సీతారామరాజు ధ్యానానికి వినియోగించిన ఉర్లకొండ గుహలను పర్యాటకుల సందర్శనకు వీలుగా ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివరామరాజును అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అభ్యర్థన మేరకు సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో గల కింంచెవానిపాలెం రిజర్వాయర్‌ను సందర్శించి, పర్యాటకంగా ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ వాటర్‌షెడ్ ద్వారా నిర్వహించిన పనులను పరిశీలించిన అనంతరం బకాయిలు చెల్లించాలనే ఉద్దేశంతోనే చెల్లింపులను నిలిపినట్టు తెలిపారు. గోకులాలు నిర్మించిన రైతులకు ఆవు లేదా గేదె ఒక్కింటికి రూ.50 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, లబ్ధిదారులు దీనిని వినియోగించుకోవాలన్నారు.

## జిల్లాలో గ్రామ పంచాయతీలకు రానున్న 'స్వచ్ఛ రథాలు'



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో గ్రామ పంచాయతీలకు 'స్వచ్ఛ రథాలు' రానున్నాయి. ప్రజల నుంచి పొడి చెత్తను సేకరించేందుకు ప్రతి మండలంలో ఒక వాహనం ఉండేలా పంచాయతీ అధికారులు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఇంతవరకు జిల్లాకు ఆరు 'స్వచ్ఛ రథాలు' (వ్యాన్లు) రాగా.. త్వరలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున రానున్నాయి. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోతున్నాయి. వీటివల్ల పలురకాల అనర్థాలు కలుగుతున్నాయి. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు ఇతర పొడి చెత్త సమస్యను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛ రథం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జూలై 10వ తేదీన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్వచ్ఛ రథాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. వీటి నిర్వహణ బాధ్యతను స్థానికులకు అప్పగించింది. ఈ వాహనాల నిర్వాహకులు గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి పొడి చెత్తను సేకరిస్తారు. పాత ఇనుము కిలో రూ.20, పాత న్యూస్‌పేపర్లు రూ.15, పాత పుస్తకాలు, అట్టపెట్టెలు రూ.10, ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ కవర్లు రూ.20, గాజుసీసాలు ఒక్కొక్కటి రూ.2, స్టీల్ వస్తువులు రూ.40, అల్యూమినియం వస్తువులు రూ.120 చొప్పున విలువ కడతారు. డబ్బులకు బదులు నిత్యావసర సరుకులను అందజేస్తారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే ప్రారంభించిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలు వస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని పభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గత శనివారం తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. జిల్లాకు కేటాయించిన ఆరు స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ రథాల సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ప్రతి మండలంలో ఒక వాహనం అందుబాటులో వుండేలా గతంలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వాహనాలను స్వచ్ఛ రథాలుగా వినియోగించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. స్వచ్ఛ రథం ప్రతి పంచాయతీకి 15 రోజులకు ఒకసారి వెళ్లేలా అధికారులు షెడ్యూల్ రూపొందిస్తారు. వాహనాల నిర్వహణకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వచ్ఛ రథాలను కేటాయించిందని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాన కల్పించడమే కాకుండా వ్యర్థాల అమ్మకం ద్వారా ఆదాయం పొందాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు.

## శరవేగంగా రహదారుల పనులు



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని పినకోట, జీనబాడు పంచాయతీ పరిధిలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారుల నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ బి.బాలూనాయక్ పరిశీలించారు. ముందుగా సమిధ నుంచి చింతపాక, తట్టపూడి, చిందులపాడు, పెదబూరగ వరకు 6.56 కిలోమీటర్ల మేర రూ.6.67 కోట్లతో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు సుదూరం కాలినడకన వెళ్లారు. పనులను పరిశీలించి, గిరిజనులతో కొంతసేపు మాట్లాడారు. గుమ్మంతి నుంచి రెడ్డిపాలెం, రాచకీలం వరకు 5.49 కిలోమీటర్ల మేర రూ.5.86 కోట్లతో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోడ్డు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అక్కడ నుంచి టోకూరు పంచాయతీ నుంచి బొర్రాపూలుగుడ వరకు జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ కొండయ్యపడాల్, డీఈఈ రామమ్, పీఐయూ డీఈఈ రవికుమార్, ఏఈలు సాంబశివరావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాక వరసిద్ధి వినాయక టెంపుల్ డైరెక్టర్ గా చల్లా నానాజీ కృష్ణవేణి దంపతులకు ఘన సన్మానం



**దేవరపల్లి, పతాకం న్యూస్:** రైవాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు చల్ల నానాజీ గారి సతీమణి చల్లా కృష్ణవేణి ఎక్స్ సర్పంచ్ వారికి శ్రీ కాణిపాక స్వయంభు దేవాలయం పాలకమండలి డైరెక్టర్ గా బాధ్యతలను చేపట్టారు . వారికి రై వాడ ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గజమాలతో, దుష్వాలులతో, పూల బొకాయితో ఘనంగా సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ స్కూల్ చైర్మన్ చల్లా సన్యాసప్పుడు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమును ఉన్న కార్యకర్తను గుర్తించి రాష్ట్ర పదవైన కాణిపాక టెంపుల్ డైరెక్టర్ ఇవ్వడం తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడు , యువ నేత నారా లోకేష్ , ఎమ్మెల్యే బండరు సత్యనారాయణమూర్తి రైవాడ ప్రజానిక తరపున ధన్యవాదాలు తెలియజేశారు. చల్లా నానాజీ మాట్లాడుతూ కష్టపడి పార్టీకి పనిచేసే వారికి ఏదో ఒక రోజున తప్పనిసరిగా పార్టీ గుర్తిస్తుందని దానికి ఇదే నిదర్శనం అని తెలియజేశారు,

## ఎల్.బి.పి అగ్రహారం-బంగారుమెట్ట' గ్రామాల్లో మొదలైన క్రిస్మస్ సందడి..

- ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ అలంకరణలు..
- ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక ఆకర్షణ తో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు





**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** విశాఖ ఉమ్మడి జిల్లాలో బుచ్చయ్యపేట మండలంలోని ఎల్.బి.పి అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు తో కళకళలాడుతున్నాయి. ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే ఈ వేడుకలకు ఈసారి ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ అలంకరణలు నిలిచాయి. రంగురంగుల దీపాల వెలుగుల్లో చర్చిలు సుందరంగా ముస్తాబై, గ్రామాలకు పండుగ శోభను తెచ్చాయి. మండలంలోని ఎల్.బి.పి అగ్రహారం, బంగారుమెట్ట బుచ్చయ్యపేట, వడ్డాది, దిబ్బడి, పొట్టిదొరపాలెం, భూపతిపాలెం గ్రామాల్లో యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చిలన్నీ వెలుగుల విందుగా మారాయి. నక్షత్రాల ఆకృతులు, క్రాస్ గుర్తులు, దేవదూతల బొమ్మలతో చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి వేళ చర్చిల చుట్టూ వెలిగే దీపాల కాంతిలో గ్రామాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. క్రిస్మస్ అనేది కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదు, ప్రేమ, శాంతి, కరుణకు ప్రతీకగా నిలిచిన పర్వదినమని స్థానికులు పేర్కొంటున్నారు. యేసు బోధించిన సత్యం, త్యాగం, మానవత్వం విలువలను గుర్తు చేస్తూ ఈ వేడుకలు అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ వేడుకల్లో భాగస్వాములై ఆనందోత్సాహాలతో పాల్గొంటున్నారు.ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు, బైబిల్ పఠనాలతో చర్చిల్లో భక్తి పారవశ్యం వెల్లివిరుస్తోంది. గ్రామస్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ క్రిస్మస్ ఆనందాన్ని పంచుకుంటున్నారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో చర్చిలు మెరిసిపోతున్నాయి.

## పక్కాగా అర్జీల నమోదు: కలెక్టర్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు (పీజీఆర్ఎస్) వచ్చే అర్జీల నమోదు ప్రక్రియ, వాటి పరిష్కార మార్గాలను మరింత పటిష్ఠం చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్‌వో వై.సత్యనారాయణరావుతో కలిసి పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 344 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించింది, లేనిదీ నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్, డీఈవో అప్పారావునాయుడు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం : ఎమ్మెల్యే గిత్త




**నంద్యాల పతాకం న్యూస్:** మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజి నాయక్, సీఐ ప్రవీణ్ రెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, ఎక్సైంజ్ సిఐ, రామాంజనేయులు నాయక్, ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు విభాగం విద్యార్థులతో కలసి డ్రగ్స్, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ . డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నందికొట్కూరు నియోజకవర్గం లో మానవ హారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రతిజ్ఞ నినాదాలు చేశారు. మాదకద్రవ్యాల నిరోధానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.. కూటమి ప్రభుత్వం లీగల్ డ్రగ్స్ కు టీమ్ ను ఏర్పాటు చేసి డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం యుద్ధభేరి మోగించిందని తెలిపారు. ఈ పోరాటంలో ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం యావజ్జీవ కారాగార శిక్ష విధించదగిన నేరం. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ లా ఆఫ్ 1977, ఎస్.10 (డి), ఎస్30 కింద కేసులు నమోదు అయితాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి , కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక.. మధుర జ్ఞాపకాల సందడి



**చింతపల్లి, పతాకం న్యూస్:** 2005- 2006 విద్యా సంవత్సరంలో ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యా యులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం ఆనందం కలిగించిందని ఆ విద్యా సంవత్సరం లో పదవ తరగతి చదువుకున్న సహచర విద్యార్థిని, విద్యార్థులు అన్నారు. 2005 - 2026 లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యను అభ్యసించిన తామంతా వివిధ ప్రాంతాల్లో వేర్వేరు వృత్తులలో స్థిరపడిన వారంతా ఎక్కడెక్కడో ఉన్న తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించుకుని వారంతా విద్య అభ్యసించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయు లతో పాటు సహచర విద్యార్థిని, విద్యార్థులు అందరూ ఆనాటి మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ క్రమంలో గడచిన 20 ఏళ్ల లో వారి వారి జీవితాలలో జరిగిన సంఘటన లను గుర్తు చేసుకుని పలువురు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థినీ, విద్యార్థులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, నేడు నర్సీపట్నం, చింతపల్లి మండలాల విద్యా శాఖ అధికారులు నారాయణ, గెమ్మెల బోడం నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కసా వెంకట రమణ, గాజుల ప్రభాకర్, రమణమూర్తి, డ్రాయింగ్ మాస్టర్ బాలాజీ, పద్మనాభం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొయ్యూరు మండల అధ్యక్షులు బిడిజన అప్పారావును పరామర్శించిన వైసీపీ నాయకులు

**కొయ్యూరు, పతాకం న్యూస్:** ఇటీవల బైక్ ప్రమాదానికి గురైన కొయ్యూరు వైసీపీ మండల అధ్యక్షులు,డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు ని జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ మరియు జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి బృందం పరామర్శించింది. ఆయన త్వరగా కోలుకొని ప్రజలకు, పార్టీ కి సేవలు అందించాలని కోరారు. అధ్యక్షులను పరామర్శించిన వారిలో జీకే వీధి మండల ఉపాధ్యక్షులు రీమల బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు

## చల్లవానిపేట కూడలిలో చెరువుల ఆక్రమణ



**అమరావతి, పతాకం న్యూస్:** మండలంలోని చల్లవానిపేట కూడలిలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ సెంటు ధర రూ.10 లక్షల పైమాటే. దీంతో జలుమూరు రోడ్డులోని ఈశ్వరప్ప చెరువు, జర్జంగి రూటులో ఉన్న రావిబంద చెరువుపై కబ్జాదారుల కన్ను పడింది. రోడ్డు పక్కన వాటిని మట్టితో కప్పేసి తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. రెండు ఎకరాల విస్తీర్ణం గల ఈశ్వరప్ప చెరువు గట్టు పూర్తిగా ఆక్రమణకు గురైంది. రావిబంద చెరువు కింద 20 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, ఈ చెరువు గర్భాన్ని కొందరు ఆక్రమించుకొని యథేచ్ఛగా భవనాలు నిర్మించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు గట్లు, గర్భాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ జె.రామారావును వివరణ కోరగా.. 'ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. తక్షణమే చల్లవానిపేట కూడలిలో ఆక్రమణలు తొలగిస్తాం? అని అన్నారు.

## గ్రావెల్ వేశారు.. తారు మరిచారు!

### రాళ్లు పైకి లేచి ఇబ్బందుల పాలవుతున్న వాహనదారులు



**జంగారెడ్డి గూడెం, పతాకం న్యూస్:** పట్టణంలోని శ్రీనివాసపురం బీటీ ఆలస్యమ వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నవంబరు లో గ్రావెల్ పోసి తారు వేయకపోవడంతో రోడ్డు పై రాళ్లు పైకి లేచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా రు. రోడ్డుపై దుమ్ము లేచి వాహనదారుల కళ్లలో పడు తోందని, రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ఇళ్ళలోకి దుమ్ము వచ్చి చేరడంతో వృద్ధులు,చిన్నపిల్లలతో అనారోగ్యాల బారి న పడుతున్నట్టు నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ సాధారణ నిధులు రూ.70 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలు మొత్తం రూ.కోటి నలభై లక్షలతో స్థానిక లక్ష్మీనారాయణ థియేటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు 1100 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను అక్టోబరు 27న ప్రారంభించారు. కాంట్రాక్టర్ రోడ్డుపై గ్రావెల్‌తో లేయర్, స్టోన్ రస్ట్, వెట్ మిక్స్ వేసి వదిలేశారు. డిసెంబరు మొదటి వారంలో రోడ్డు పనులు పూర్తవుతాయని అధికారులు చెప్పినా నెల ఆఖరు వారంలోకి వచ్చినా ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. లక్ష్మీనారాయణ థియేటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు 1310 మీటర్ల రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం 1100 మీటర్ల మేర రోడ్డుకు మాత్రమే నిధులు సరిపోవడంతో రెండు వందల పది మీటర్ల రోడ్డును వదిలేశారు. దీంతో ఆ కొద్ది రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నా మని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపెద్ద గ్రావెల్ రాళ్లు పైకి లేచి ద్విచక్ర వాహనాలు నడపలేక పోతున్నామని చెబుతున్నారు. ఇటీవల ఓ మహిళ తన ద్విచక్ర వాహనంపై ఆ రోడ్డులో వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యం: నాతవరం సమావేశంలో సూర్యచంద్ర



**నాతవరం, పతాకం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా ప్రతి జనసైనికుడు అంకిత భావంతో పనిచేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. మంగళవారం నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కొరత, రహదారుల దుస్థితి, పారిశుధ్య లోపాలు, విద్యుత్ సమస్యలు వంటి మౌలిక వసతుల అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. ప్రజలతో నిత్యం మమేకమై ఉండడమే పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ ప్రకటించే అభ్యర్థులను గెలిపించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, సీనియర్ నాయకులు నరసింహారావు, ప్రగడ కృష్ణ, అరవ లక్షణరావు, నాయకులు గుడివాడ కృష్ణ, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రమణ, బొడ్డు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గిల్లల బంధ గ్రామానికి తక్షణమే స్కూల్ భవనం మంజూరు చేయాలి



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, బలపం పంచాయతీ పరిధి లోని గిల్లేల బంధ గ్రామంలో స్కూల్ భవనం లేకపోవడం వల్ల గ్రామ పిల్లల విద్య భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామంలో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, సరైన స్కూల్ భవనం లేకపోవడంతో పిల్లలు చదువుకునేందుకు అనుకూల వాతావరణం లేకుండా పోయిందన్నారు.

ఈ పరిస్థితిలో గ్రామస్తులు సొంత ఖర్చులతో తాత్కాలికంగా రేకుల షెడ్డును ఏర్పాటు చేసి పిల్లలకు విద్యాబోధన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ఎన్నిసార్లు కలెక్టర్, పీవో, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోయారు. ప్రస్తుతం పిల్లల చదువులు పాకలలో కొనసాగుతున్న పరిస్థితి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి గిల్లల బంధ గ్రామానికి శాశ్వత స్కూల్ భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్కూల్ చైర్మన్ కె నాగరాజు, కె కోటి బాబు, గ్రామ పెద్దలు వంతల రవికుమార్, పి రామలింగం,వి నారాయణరావు, వంతల సత్తిబాబు, లింగిటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలి



**మక్కువ, పతాకం న్యూస్:**కంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వి బి జి రాంజీ నూతన గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని మంగళవారం ఎంపీడీవో ఆఫీసు వద్ద రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందరంగా రైతుకూలి సంఘం(ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు పీడిక అసిరి మాట్లాడుతూ 2005లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని, వలసలను అరికట్టడానికి అందరికీ ఉపాధి గ్యారెంటీ చేస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చిందని దీనికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులను కేటాయింపులు జరిగేవని అన్నారు. ప్రస్తుతం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులను తగ్గించే వేస్తున్నదని ఇప్పుడు పూర్తిగా పథకాన్ని ఎత్తివేసే కుట్రతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ జి రాంజీ పథకాన్ని తీసుకువచ్చిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 60 శాతం నిధులను మాత్రమే కేటాయిస్తుందని మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మార్పులు కారణంగా దీనివలన గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా ఎత్తివేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆ పథకానికి నిధులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా సమకూర్చాలని అలాగే పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. అనంతరం ఏపీవో ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణకు మెమరాండం అందజేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఏపీవో ఈశ్వర మ్మ కూలీలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకుల మర్రి బుగిలమ్మ, ఎం ప్రసాద్, బండపల్లి వెంకటి, సీతయ్య, తౌడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పథకం పేరును మార్చి, దీనిని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని వామపక్ష నాయకులు ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో మార్పులను వ్యతిరేకిస్తూ నెహ్రూచౌక్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్.దొరబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, వ్యవసాయ కూలీల వలసలను నివారించడానికి రెండు దశాబ్దాల క్రితం వామపక్షాల పోరాటం ఫలితంగా అప్పటి యూపీఏ ప్రభుత్వం 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికుల అవసరాన్నిబట్టి ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించే వారని, కేంద్ర ప్రభుత్వం పేరుతోపాటు విధి విధానాలను మార్చివేయడంతో కూలీలకు పూర్తిస్థాయిలో పనులు లభించవని అన్నారు. పని దినాలను వంద నుంచి 125 రోజులకు పెంచనున్నట్టు చెప్పడం కూలీలను మభ్యపెట్టేందుకేనని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్టు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, గండి నాయనబాబు, కర్రి అప్పారావు, వైఎన్ భద్రం, కె.శంకర్రావు, ఫణేంద్ర, బాబ్జి పాల్గొన్నారు.

## లంబసింగి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి

**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్రా కశ్మీర్ గా పేరొందిన లంబసింగి పంచాయతీ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లంబసింగి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్ కోరారు. పాడేరు విచ్చేసిన వైసీపీ సీనియర్ నేత, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి భర్త చెట్టి వినయ్ ని ఆ పార్టీ లంబసింగి పంచాయతీ కి చెందిన పలువురు నాయకులతో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. లంబసింగి పంచాయతీ లో నెలకొన్న సమస్యల గురించి చర్చించడం తో పాటు ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడం జరిగిందని సోమవారం స్థానిక విలేకరులకు వివరించారు.

## మేడవరపు చెరువు కబ్జా



**చింతలపూడి, పతాకం న్యూస్:** జిల్లాలో అధిక శాతం వరి పండించే మండలాల్లో చింతలపూడి మండలం రెండోది. మండలంలో వర్షాధార చెరువులతో వరి సాగు చేస్తారు. వర్షాభావం ఏర్పడితే చెరువులన్నీ మైదానాలే. మండలంలో 36 పెద్ద చెరువులు, 120 చిన్న కుంటలు ఉన్నాయి. భూముల ధరలు పెరగడంతో చెరు వులను సైతం ఆక్రమిస్తున్నారు. మండలంలోని మేడవరపు చెరువు కబ్జా కోరల్లో చిక్కింది. ఎర్రకాలువ జన్మస్థానం అయిన ఈ చెరువు ఎంతో చరిత్ర కలిగి ఉంది. చెరువు విస్తీర్ణం 360 ఎకరా లు కాగా 150 ఎకరాలు ఆక్రమణలో ఉంది. దీంతో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. శెట్టివారిగూడెంలో ఉన్న చెరు వు ఒకప్పుడు 120 పల్లెకారు కుటుంబాలకు జీవనోపాధి. మండు వేసవిలోను నీరు నిల్వ ఉండడంతో పడవలపై చేపలు పట్టి, చెరువులో తామరాకుల విక్రయాలతో జీవనం సాగించేవారు. చెరువు ఎగువన చిన్నాపెద్ద చెరువులు 70 వరకు ఉంటాయి. వర్షాకాలంలో, తుఫాను సమయంలో ఆ చెరువులు నిండి అదనపు నీరు ఈ చెరు వుకు చేరతాయి. ఈ చెరువు రెండు అలుగుల నుంచి అదనపు నీరు ఎర్రకాలువగా మారుతుంది. ఆక్రమణలపై పలుమార్లు గ్రామ పెద్దలు ఫిర్యాదులు చేస్తే అధికారులు సర్వే పేరిట ఆక్రమణదారులతో కుమ్మక్కై వదిలేశారన్న ఆరోపణలున్నాయి. దిగువన అధికారికంగా, అనధికారికంగా 700 ఎకరాలు సాగులో ఉంది. అవన్నీ రెండు పంటలు వేసే భూములు. ఇప్పుడు ఆక్రమణదారుల వల్ల చెరువునీటి సామర్థ్యం తగ్గి సాగు నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఆక్రమణలు తొలగించి చెరువు అభివృద్ధి చేస్తే దిగువన రెండు పంటలకు సాగు నీరందడమే కాకుండా వంద పల్లెకారు కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

## బాల్య వివాహాలు అనర్థదాయకం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** బాల్య వివాహాలు సమాజానికే అనర్థదాయకం అని జిల్లా న్యాయాధికారి జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొన్నిచోట్ల ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ మేరకు బ్రోచర్లు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, న్యాయవాదులు గేదెల వాసుదేవరావు, వాడపల్లి జోతిర్మయి, వి.హరిప్రియ, పారా లీగల్ వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి లేక అటవీ మార్గంలోనే వాటర్ ట్యాంకును వదిలేసారని సూదులుపాడు గిరిజనుల ఆవేదన

**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలం బూదరాళ్ళు పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం సూదులుపాడులో మౌలిక వసతుల కొరత గిరిజనుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.గ్రామానికి అవసరమైన ప్లాస్టింగ్ వాటర్ ట్యాంకు మంజూరై వచ్చినప్పటికీ,సరైన రహదారి లేకపోవడంతో మార్గమధ్యలోనే ట్యాంకును దింపాల్సిన దుస్థితి నెలకొంది. సూదులుపాడు గ్రామానికి వెళ్లాలంటే సాకులుపాలెం గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్లకు పైగా కాలి బాట మాత్రమే ఉంది.ఇరుకైన అటవీ మార్గంలో భారీ వాటర్ ట్యాంకును తరలించడం అసాధ్యంగా మారడంతో అధికారులు ట్యాంకును మధ్యలోనే వదిలివేశారు.దీంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య అలాగే కొనసాగుతోంది.ఈ సమస్యపై ఎన్నో రోజులుగా ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను కలుస్తున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన పరిష్కారం దక్కలేదని గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యుగాలు మారాయి, ప్రభుత్వాలు మారాయి,అధికారులు మారారు కానీ మా తలరాత మాత్రం మారలేదు అంటూ వారు వేదనతో ప్రశ్నిస్తున్నారు.కనీసం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మిస్తే తాగునీటి సమస్యతో పాటు అనేక మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, రాజకీయ నాయకులు స్పందించి తమ బాధను అర్థం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అద్దంకిలో రియల్ ధరలకు కదలిక




**ప్రకాశం, పతాకం న్యూస్:** అద్దంకిలో రియల్ ఎస్టేట్ ధరలలో ఒక్కసారి గా కదలిక వచ్చింది. ఇటీవల వరకు స్తబ్ధుగా ఉన్న స్థలాల ధరలతో రియలెస్టేట్ వ్యాపారం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతా యని భావించినా పెద్దగా కదలిక లేదు. అయితే ఇటీవల అద్దంకి నియోజకవరాన్ని ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లాలో కలపడం, అద్దంకి కేంద్రంగా అద్దంకి, దర్శి నియోజకవర్గాలను కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అద్దంకిలో రియల్ ఎస్టేట్ ధరలలో కదలిక వచ్చింది. మినీబైపాస్ రోడ్డు ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు కూడా తొలగి ఆక్రమణలు తొల గింపు జరుగుతుండడం, కాలువ కట్టలను ప్రాథమికంగా అభివృద్ధి చేసేందుకు గ్రావెల్ లోతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా అద్దంకి మేజర్ కాలువకు తూర్పువైపున ఉన్న పలు కాలనీలలో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అదేసమయంలో రేణింగవరం రోడ్డులో చెరువు కొమ్ముపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సుమారు 14 ఎకరాల ప్రభుత్వ భూమిలో డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసే అవకాశం ఉండడం, స్టేడియం కూడా నిర్మించే అవకాశం ఉండడంతో రేణింగవరం రోడ్డులో కూడా రియల్ ఎస్టేట్ ధరలు పెరిగాయి. దశాబ్ద కాలం క్రితం వెంచర్లు వేసి చిల్లచెట్లు తో నిండి ఉన్న ప్రాంతాలను కూడా ముస్తాబు చేసి సిద్ధం చేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసిన వారిలో ఆనందం వెల్లువిరుస్తుండగా కొత్తగా ఆయా ప్రాంతాలలో స్థలాలు కొను గోలు చేసేందుకు సిద్ధమయ్యే వ్యక్తులు మాత్రం పరుగులు తీస్తున్నారు. అందివచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిద్ధం అవుతున్నారు.

## ఏపీ లాయర్లకు గుడ్ న్యూస్..
## రూ.5.60 కోట్ల సంక్షేమ సాయం మంజూరు

**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో న్యాయవాదులకు ఏపీ బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంక్షేమ కమిటీ గుడ్‌న్యూస్ చెప్పింది. లాయర్లకు మరణానంతర ప్రయోజనాలు, వైద్య ఖర్చులు, పదవీ విరమణ ప్రయోజనాల కింద ఆర్థిక సాయం అందించేందుకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ కమిటీ ఆమోదించింది. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుని, మొత్తం రూ.5.60 కోట్లకు పైగా నిధులను న్యాయవాదులు మరియు వారి కుటుంబాలకు మంజూరు చేసింది. ఈ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి. నరసింగరావు పాల్గొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, ఆమోదం తెలిపారు. మరణానంతర ప్రయోజనాల కింద 54 మంది న్యాయవాదుల కుటుంబాలకు రూ.3.51 కోట్లను మంజూరు చేశారు. అలాగే, తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందిన 137 మంది న్యాయవాదులకు వైద్య ఖర్చుల కోసం రూ.1.90 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద ఏడుగురు న్యాయవాదులకు రూ.19.20 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని కలిపి మొత్తం రూ.5,60,80,000 నిధులు న్యాయవాదులు మరియు వారి కుటుంబాలకు అందనున్నాయి. ఈ ఆర్థిక సహాయం న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గిస్తుందని, వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని సంక్షేమ కమిటీ పేర్కొంది. మంజూరైన నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం, బార్ కౌన్సిల్ తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయమని పలువురు లాయర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొత్త ఏడాదిలో ఐసీఐసీఐ
## క్రెడిట్ కార్డ్‌పై కొత్త బాదుడు



**ముంబై:** ఐసీఐసీఐ క్రెడిట్ కార్డ్ వాడుతున్న వారికి కొత్త ఏడాదిలో చార్జీల మోత మోగనుంది. ఆన్ లైన్ గేమింగ్, యూపీఐ వ్యాలెట్ లలో నగదు జమ చేస్తే చార్జీ వసూలు చేయనున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ పేర్కొంది. క్రెడిట్ కార్డ్ చార్జీలలో పలు మార్పులు చేయనున్నట్లు ప్రకటించింది. రివార్డు పాయింట్ల విషయంలోనూ పలు మార్పులు చేయనుంది. వచ్చే ఏడాది జనవరి- ఫిబ్రవరి మధ్య కాలంలో ఈ మార్పులను విడతలవారీగా అమలులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ఆనై లైన్ గేమింగ్ ప్లాట్ ఫారమ్ లలో జరిపే క్రెడిట్ కార్డు లావాదేవీలపై 2 శాతం, అమెజాన్ పే, పేటీఎం వంటి వ్యాలెట్లలో రూ.5 వేల కంటే ఎక్కువ నగదును లోడ్ చేస్తే 1 శాతం, రూ. 50 వేలకు మించి చేసే ట్రావెలింగ్ ఖర్చులపై 1 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఐసీఐసీఐ తెలిపింది. అంతేకాదు, ఐసీఐసీఐ బ్రాంచ్ లలో క్రెడిట్ కార్డ్ బిల్లును నగదు రూపంలో చెల్లిస్తే రూ.150 అదనంగా సమర్పించుకోవాల్సిందే. 'ఎమెరాల్డ్ మెటల్' వంటి ప్రీమియం కార్డ్ ద్వారా ప్రభుత్వ సేవలు, ఫ్యూయెల్, రెంట్, పన్ను, వ్యాలెట్ లావాదేవీలు జరిపినపుడు గతంలో కస్టమర్లు రివార్డు పాయింట్లు పొందేవారు. ఇకపై ఈ రివార్డులు పూర్తిగా నిలిపివేయనున్నట్లు బ్యాంక్ తెలిపింది. రవాణా ఖర్చుల కోసం కార్డు వాడితే నెలకు రూ.20 వేల వరకు మాత్రమే రివార్డ్ పాయింట్లు పొందవచ్చని వివరించింది. యాడ్ ఆన్ కార్డు కోసం రూ.3,500 వసూలు చేయనున్నట్లు పేర్కొంది. బుక్ మై షోలో 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' ఆఫర్ పొందాలంటే గడిచిన మూడు నెలల్లో కార్డుపై కనీసం రూ.25 వేలు ఖర్చు చేసి ఉండాలని బ్యాంకు షరతు విధించింది. ఇన్ స్టంట్ ప్లాటినం కార్డ్ హెూల్డర్లకు ఫిబ్రవరి నుంచి ఈ ఆఫర్ పూర్తిగా నిలిపివేయనున్నట్లు ప్రకటించింది.

# సంక్షోభంలో జీడి పరిశ్రమ!



**పలాస, పతాకం న్యూస్:** ఒకప్పుడు పలాస జీడి పరిశ్రమకు అంతర్జాతీయంగా మంచి పేరుండేది. జీడిపప్పు ఎగుమతులు, దిగుమతుల్లో రాష్ట్రంలోనే పలాస నెంబర్ వన్ స్థానంలో ఉండేది. అలాంటి జీడి పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయింది. జీడి పిక్కల ప్రాసెసింగ్‌కు అధిక ఖర్చు కావడం, పప్పు అమ్మకాలు సాగకపోవడం, దీనికోసం దళారులను ఆశ్రయించడం, ఒడిశా మార్కెట్‌కు డీలర్లు వెళ్లిపోవడం తదితర కారణాలతో పలాస జీడి వ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రూ.120కోట్లకు పైగా వారికి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. దీంతో జీడి వ్యాపారాన్ని పూర్తిగా బంద్ చేస్తామని వ్యాపారులు చెబుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 400 జీడి పరిశ్రమలు ఉండగా ఇందులో ఒక్క పలాసలోనే 240 పైగా ఉన్నాయి. ఇక్కడ 16వేల మందికి పైగా జీడి కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 90శాతం మహిళలే. వ్యాపారులు 500 మంది వరకూ ఉంటారు. వీరిలో కొందరు సొంతంగా, మరికొందరు అద్దె విధానంలో పరిశ్రమలను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. దేశీయంగా ఈ ప్రాంతంలో 35 వేల హెక్టార్లలో జీడిపంట సాగవుతుంది. దీంతో ఇక్కడ ఉత్పత్తి జరిగే జీడి పిక్కలు కేవలం మూడు నెలలకు మాత్రమే పరిశ్రమల నిర్వహణకు సరిపోతాయి. ఏడాది పొడవునా జీడి పరిశ్రమలు నిర్వహించాలన్నా, కార్మికులకు ఉపాధి కల్పించాలన్నా విదేశీ జీడి పిక్కలు తీసుకురావడం తప్పనిసరిగా మారింది. ఈ పరిస్థితుల్లో విదేశీ జీడిపిక్కలు ఇచ్చేందుకు మన రాష్ట్రంతో పాటు కేరళ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ట్రేడింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం జీడి పరిశ్రమల నిర్వహణ సులభతరంగా మారింది. ఆధునిక యంత్రాలు రావడంతో పనిసులభమై పప్పు ఉత్పత్తి శాతం పెరిగింది. అయితే కరోనా వచ్చిన నుంచి జీడిపప్పు వ్యాపారానికి గ్రహణం పట్టింది. ఎగుమతులు జరుగుతున్నా అందుకు తగ్గ ఆదాయం వ్యాపారులకు అందడం లేదు. కొనుగోలుదారుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. జీడిపిక్కల రేట్లు భారీగా పెరిగినా పప్పురేట్లు తగ్గుదల కావడంతో వ్యాపారులు ఎటూపాలుపోలేని స్థితికి చేరుకున్నారు. వ్యాపారులు నేరుగా జీడిపప్పు అమ్మకాలు చేయడానికి అవకాశం లేకపోవడంతో బ్రోకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. వారు చెబుతున్న ధరలకు సరుకును అందిస్తున్నారు. ఇదే అదునుగా వారు జీడిపప్పు సేకరించిన తరువాత విడతలవారిగా నగదును వ్యాపారులకు ఇస్తుండడంతో వ్యయభారం పెరిగిపోతోంది. ప్రస్తుతం జీడి పిక్కలను ప్రాసెసింగ్ చేసి పప్పును మార్కెట్‌లో తరలించే సమయానికి బస్తాకు రూ.1800 ఖర్చవుతోంది. దీంతో పప్పు ధరలు పెంచక తప్పడం లేదు. హెూల్‌సేల్ మార్కెట్‌కు వచ్చేసరికి పొరుగు రాష్ట్రాల్లో పప్పు రేట్ల తగ్గుదల కారణంగా ఆ ప్రాంతానికే డీలర్లు వెళ్లిపోతున్నారు. దీనివల్ల ఒక్కో వ్యాపారి ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40 లక్షల వరకూ నష్టపోయినట్లు ప్రచారం జరుగుతోంది. చిన్నవ్యాపారుల పరిస్థితి మరీదారుణంగా మారింది. ఒక్కో వ్యాపారికి ఈ ఏడాది కనీసం రూ.10 లక్షల వరకూ నష్టం వచ్చినట్లు అంచనా. అదే ఒడిశా రాష్ట్రంలో బస్తాకు రూ.1200 మాత్రమే ఖర్చవుతోంది. దీనికి తోడు స్కిల్డ్ కార్మికులు ఉన్న కారణంగా పప్పు నాణ్యతగా ఉండడంతో పాటు ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో అన్ని రాష్ట్రాల వ్యాపారులు ఒడిశా వైపే చూస్తున్నారు. ప్రస్తుతం ఒడిశా జీడి మార్కెట్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఒడిశా రాష్ట్రం ప్రస్తుతం దేశంలోనే జీడి వ్యాపారంలో నెంబర్ 1 స్థానానికి ఎగబాకింది. ఎందుకంటే అక్కడ జీడి పిక్కల నిర్వహణ ఖర్చు మిగిలిన రాష్ట్రాల కంటే 40 శాతం తక్కువకు ఉంది. దీంతో అక్కడి వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. పప్పు ధరలు కూడా తక్కువగా ఉండడంతో జీడి డీలర్లు కూడా ఆ రాష్ట్రంవైపే చూస్తున్నారు.

పలాస మార్కెట్ అంతర్జాతీయంగా నాలుగైదేళ్లు శాసించింది. అయితే ఒక్కడ జరుగుతున్న పరిణామాలతో ఆ ఖ్యాతి కోల్పోయే దిశకు చేరుకోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. మొక్క జీడిపప్పుగా ఖ్యాతి గాంచిన పలాస జీడి మార్కెట్ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షోభంలోకి కూరుకుపోవడం చర్చనీయాంశంగా మారింది. పలాస జీడికి జాతీయస్థాయిలో మంచి గుర్తింపును తీసుకురావడానికి, బ్రాండ్ సంపాదించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలోనే ఈ పరిస్థితి ఏర్పడడం సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. అయితే, తమకు ఈ పని తప్పా వేరే గత్యంతరం లేదని, కష్టమైనా, నష్టమైనా దీన్నే కొనసాగిస్తామని కొంతమంది వ్యాపారులు చెబుతుంటే, మరికొందరు మాత్రం ఇదేవిధానం కొనసాగితే జీడి వ్యాపారాన్ని పూర్తిగా బంద్ చేసి కొత్త వ్యాపారానికి వెళ్లిపోతామని అంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం కలుగజేసుకొని పలాస జీడి పరిశ్రమను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

# వేరుశనగ సాగులో యాంత్రీకరణ

**రాంబిల్లి, పతాకం న్యూస్:** వేరుశనగ సాగులో యాంత్రీకరణతో శ్రమ, ఖర్చు, సమయం ఆదా అవుతాయి. విత్తనం నాటడం, కలుపుతీత, వేరుశనగ కాయలు వలవడం, కాయల నుంచి విత్తనాలు వేరుచేయడం వంటి పనులకు ఆయా యాంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ యంత్రాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, యంత్రాల ఖరీదు గురించి బీసీటీ-కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత గౌడ తెలిపిన వివరాలు.. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో ఎక్కువగా పచ్చి కాయలను (ఉడకబెట్టడానికి) విక్రయించడానికి రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. రబీలో వాణిజ్య సరళిలో..అంటే ఎండుకాయలుగా అమ్ముతుంటారు. ఉమ్మడి జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు పది వేల ఎకరాల్లో వేరుశనగ సాగవుతున్నట్టు వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. పొలం దున్నడం నుంచి పంట కోత వరకు రైతులు మనుషులు, పశువుల సాయంతోనే వేరుశనగను పండిస్తుంటారు. దీనివల్ల ఖర్చులు అధికం అవుతున్నాయి. వేరుశనగ సాగులో యంత్రాలను వినియోగిస్తే ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. పొలం దున్నడానికి, అంతరకృషి వంటి పనులకు ఇప్పటికే యంత్రాలు అందుబాటులోకి వచ్చిన విషయ తెలిసిందే. ఇప్పుడు విత్తనాలు వేయడానికి కూడా యంత్రాలు వచ్చాయి. 'హ్యాండ్ పుష్ సీడ్ డ్రిల్'గా పిలిచే ఈ యంత్రంతో వేరుశనగ, మొక్కజొన్నతోపాటు మొత్తం 12 రకాల పంట విత్తనాలను నాటుకోవచ్చు. విత్తన పరిమాణాన్నిబట్టి మీటరింగ్ వీల్ సాయంతో సర్దుబాటు చేసుకోవాలి. మొక్కల మధ్య, వరుసల మధ్య ఎంతెంత దూరం వుండాలో కూడా సెట్ చేసుకోవచ్చు. ఈ యంత్రంలో ఒక మనిషి 2-3 గంటల్లో ఒక ఎకరం పొలంలో విత్తనం వేయవచ్చు. పాత విధానంలో ఈ పనికి ఎకరాకు రూ.4,500 వరకు ఖర్చు అవుతుంది. యంత్రంతో అయితే రూ.500 సరిపోతుంది. మొక్కలు, వరుసల మధ్య తగిన దూరం వుండడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా ప్రసగించి, పంట ఏపుగా పెరుగుతుంది. దిగుబడులు ఆశాజనకంగా వుంటాయి. ఈ యంత్రం ధర సుమారు రూ.7,500 ఉంటుంది.వేరుశనగ కాయలు పక్వానికి వచ్చిన తరువాత రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుని మొక్కలను పీకిస్తారు. కొద్ది రోజులు ఎండిన తరువాత మళ్లీ కూలీలతో కాయలను వలిపిస్తారు. ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ కాయలు వలవడానికి సుమారు



20 మంది కూలీలు అవసరం అవుతారు. ఇందుకు ఆరు నుంచి ఏడు వేల రూపాయల వరకు కూలి చెల్లించాల్సి వుంటుంది. అదే యంత్రంతో అయితే ఇందులో సగం ఖర్చుతో పని పూర్తవుతుంది. ఈ యంత్రం ఖరీదు రూ.65,000. గ్రామంలో ఒక రైతు కొనుగోలు చేసుకుని, మిగిలిన రైతులకు అద్దెకు ఇచ్చుకుంటే ఏడాదితోనే యంత్రం కొనుగోలు డబ్బులు తిరిగి వచ్చేస్తాయి. ఈ యంత్రం ద్వారా వేరుశనగ కాయల నుంచి గింజలను వేగంగా వేరుచేయవచ్చు. కూలీల అవసరం గణనీయంగా తగ్గి సమయం, ఖర్చు ఆదా అవుతుఆయి. గింజలకు నష్టం తక్కువగా ఉండి నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఈ యంత్రం ధర రూ: 6.500. మరింత సమాచారం కోసం 84311 05162 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని బీసీటీ-కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత గౌడ తెలిపారు.

## పాపయ్య కాలనీని పరిశీలించిన ఎన్విరాన్ మెంట్ అధికారులు

**కోనసీమ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని పాపయ్య కాలనీని మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎమ్.బి.ఎస్.శంకర్రావు, ఏఈ శ్రీ ఫణీత మంగళవారం పరిశీలించారు. రైస్ మిల్లుల కాలుష్యంతో నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామని, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నామని కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదుపై పరిశీలనకు వారు వచ్చినట్లు తెలిపారు. కాలనీ వాసులతో మాట్లాడి వారి ఇబ్బందులన్నీ తెలుసుకున్నారు. పలు గృహాలకు వెళ్లి కాలుష్యం వల్ల వెలువెత్తిన దుమ్ము, ధూగరలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతున్న మహిళలు తమ ఆవేదనను వారి వద్ద వ్యక్తం చేశారు. కొందరు చర్మ వ్యాధులతో బాధపడుతున్న తీరును సైతం వివరించారు. తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎన్విరాన్మెంట్ అధికార బృందం మొత్తం అన్ని అంశాలు పరిశీలించామని,



ఉన్నతాధికారులకు ప్రస్తుత పరిస్థితిని నివేదిక రూపంలో అందజేస్తామని వారు తెలిపారు.

# విటమిన్ 'డి' లోపంతో ఆరోగ్య సమస్యలు ఎలా ఉంటాయో తెలుసా?



తరచూ జబ్బు పడటం, ఉన్నట్టుండి జుట్టు ఊడిపోవడం, అరగంట పనిచేసినా అలసటతో కూర్చువడం, మందులు వేసుకున్నా బీపీ కంట్రోల్ కాకపోవడం ఈ అనారోగ్యాలన్నింటికీ ప్రధాన కారణం విటమిన్ డి లోపం. సాధారణంగా 'సన్ షైన్ విటమిన్' గా పిలిచే విటమిన్ డి, కేవలం ఎముకలను దృఢంగా ఉంచడమే కాకుండా శరీరంలో ఒక 'హార్మోన్'లా పని చేస్తుందంటున్నారు నిపుణులు. ఇది షుగర్ మెటబాలిజం, కొవ్వు ప్రక్రియలు, వాపు, రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. విటమిన్ డి లోపం వల్ల టైప్ 2 డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్, ఫ్యాటీ లివర్ సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయని పేర్కొంటున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం! ఆరోగ్యకరమైన రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నిర్వహించడానికి కీలకమైన ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో విటమిన్ డి పాత్ర పోషిస్తుందని జర్నల్ ప్రచురించింది. శరీరంలో విటమిన్ డి తగినంతగా ఉన్నప్పుడు, ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగ్గా ఉంటుందని చెబుతున్నారు. దీంతో కణజాలాలు ఇన్సులిన్ సంకేతాలకు బాగా స్పందిస్తాయని పేర్కొంటున్నారు. విటమిన్ డి లోపం వల్ల కణాలు ఇన్సులిన్‌ను సరిగ్గా స్పందించవని, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయంటున్నారు.

కాలేయం ఫ్యాట్ మెటబాలిజంను నియంత్రిస్తుంది. విటమిన్ డి లోపం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, చెడు కొలెస్ట్రాల్ పెరగడం వంటి సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. విటమిన్ డి లోపాన్ని సరిదిద్దడం ద్వారా కాలేయంలో వాపును తగ్గించి, కొవ్వు స్థాయిలను మెరుగుపరచవచ్చని సూచిస్తున్నారు. విటమిన్ డి లోపం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడి టైప్ 2 డయాబెటిస్, వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే, వివరించలేని అలసట, ఒళ్లు నొప్పులు, తక్కువ శక్తి ఉండటానికి విటమిన్ డి లోపం ఒక ముఖ్య కారణం కావచ్చంటున్నారు నిపుణులు. టైప్ 2 డయాబెటిస్ మెల్లిటస్ ఉన్న రోగులలో విటమిన్ డి లోపం ఇన్సులిన్ నిరోధకత పెరగడానికి దారితీస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నప్పటికీ చాలా మందిలో ఈ లోపం కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణాలు: ఎక్కువ సమయం ఇంటి లోపల గడపడం సన్‌స్క్రీన్ వాడకం వల్ల చర్మం విటమిన్ డిని తయారు చేసుకోలేకపోవడం.

చర్మం నల్లగా ఉన్నవారిలో మెలనిన్ ఎక్కువగా ఉండటం వల్ల వారికి ఎక్కువ సూర్యరశ్మి అవసరమవుతుంది.ఉదయం 9 గంటల్లోపు వచ్చే ఎండ నుంచే డి విటమిన్ అందుతుందని చాలామంది అనుకుంటారు. కానీ, నిజానికి ఉదయం 10 - 3 గంటల మధ్య ఇది మనకు పుష్కలంగా లభిస్తుందంటున్నారు నిపుణులు. ఈ టైంలో 15-30 నిమిషాల వరకూ ఎండ మన శరీరానికి తగిలితే సరిపోతుందని పేర్కొంటున్నారు. సూర్యుడి నుంచి సరైన విటమిన్ & సప్లిమెంట్ పొందడానికి, సూర్య రశ్మికి ఉత్తమ సమయం మధ్యాహ్నం అని అధ్యయనంలో పేర్కొంది.

శరీరానికి పూర్తిగా కప్పే దుస్తులు వేసుకుంటే, మన చర్మానికి సూర్మరశ్మి అసలు తగలదని చెబుతున్నారు. అలాగే, సన్?స్క్రీన్ లోషన్ రాసుకున్నా విటమిన్ డి అంతగా తయారవ్వదని వివరిస్తున్నారు. కాబట్టి, ఎండ కోసం బయటకు వెళ్లినప్పుడు ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఇంట్లో కిటికీలు, కారు, బస్సులో వెళుతున్నప్పుడూ అద్దాల మీదుగా సూర్యరశ్మి ఒంటి మీద పడటం పెద్దగా ఉపయోగపడదని పేర్కొంటున్నారు.హానికరమైన సూర్య కిరణాలను చర్మంలో వర్ణద్రవ్యం (మెలనిన్) అడ్డుకుంటుందంటున్నారు నిపుణులు. అందుకే, ముదురు రంగు చర్మం ఉన్నవాళ్లు ఇంకాస్త ఎక్కువసేపు ఎండలో ఉండటం మంచిదని సూచిస్తున్నారు.

పిల్లల్ని రోజంతా ఇంట్లోనే ఉంచకుండా ఆరుబయటా ఆడనివ్వాలంటున్నారు. పెద్దవాళ్లు కూడా వీలు కుదుర్చుకుని స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూనో, వాకింగ్ చేస్తూనో ఎండలో గడపాలని పేర్కొంటున్నారు. కొన్ని రకాల ఆహార పదార్థాల నుంచి కూడా డి విటమిన్ లభిస్తుంది. ఎండతో పోలిస్తే అది తక్కువే అయినా ఆ డైట్‌ని ఫాలో అయితే ఈ లోపాన్ని కొంత తగ్గించుకోవచ్చని తెలియజేస్తున్నారు. నిద్రపట్టకపోవడం, నీరసం, అలసట, ఒళ్లునొప్పులు ఇవన్నీ మామూలు అనారోగ్య సమస్యలే కదా, అంటూ ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దం టున్నారు నిపుణులు. డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, ఒబెసిటీ, ఎముకల బలహీనత లేదా విపరీతమైన అలసట ఉన్నవారు కనీసం ఆరు నెలలకోసారైనా డి విటమిన్ రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ విటమిన్ లోపం స్థాయిని బట్టి తగిన మోతాదులో డాక్టర్లు ట్యాబెట్లూ, షాట్స్ లాంటి డి విటమిన్ సప్లిమెంట్లను సూచిస్తారని పేర్కొంటున్నారు.

# "మోచేతులు, మోకాళ్లు నల్లగా ఉన్నాయా?"



అందంగా, యవ్వనంగా, కోమలంగా మెరిసే చర్మం కావాలని కోరుకోనివారు ఎవరైనా ఉంటారా అందుకే, అమ్మాయిలు ముఖంతో పాటు పాదాలు, చేతుల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ క్రమంలో తరచూ పార్లర్‌లో పెడిక్యూర్, మానిక్యూర్ చేయించు కుంటారు. అయితే, ఇంత చేసినా కొందరిలో మోచేతులు, మోకాళ్లు, కాలిమడమలపై చర్మం నల్లగా, గరుకుగా మారుతుంది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకునే మార్గాలు మన ఇంట్లోనే బోలెడున్నాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆరోగ్యం, అందానికి మేలు చేసే పదార్థాల్లో కలబంద ముందు వరుసలో ఉంటుందని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఉపయోగించి మోచేతులు, మోకాళ్ల నలుపును సులభంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. దీనికోసం కలబంద గుజ్జును మోచేతులు, మోకాళ్లపై నల్లగా ఉన్న చోట రాసుకోవాలని, ఆ తర్వాత ఇరవై నిమిషాల పాటు ఆరనిచ్చి, గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుందని సూచిస్తున్నారు. ఇలా రోజుకి రెండు సార్లు క్రమం తప్పకుండా చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుందని అంటున్నారు. కలబందలో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా చేయడంతో పాటు మృదువుగా మార్చుతాయని వివరిస్తున్నారు. కొందరిలో మోచేతుల దగ్గర చర్మం మరీ నల్లగా ఉంటుంది. అలాంటి వారు చక్కెర ఉపయోగిస్తే చక్కని ఫలితం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. దీనికోసం ఒక టీస్పూన్ ఆలివ్ నూనెలో కొద్దిగా చక్కెర వేసి బరకగా ఉన్న మిశ్రమంలా కలుపుకోవాలని చెబుతున్నారు. దీన్ని నల్లగా మారిన మోచేతులపై రాసుకొని 10-15 నిమిషాల పాటు మర్దన చేసుకుని, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. చక్కర మంచి స్క్రబ్‌లా పని చేసి మృతకణాలను తొలగిస్తుందని, ఆలివ్ నూనె చర్మం మృదువుగా మారేందుకు తోడ్పడుతుందని పేర్కొంటున్నారు. ఇలా రోజుకోసారి చేస్తే క్రమంగా మోచేతులపై నలుపు కనుమరుగవుతుందని తెలియజేస్తున్నారు.

ఇందులో ఉండే విటమిన్లు, ఇతర పోషకాలు చర్మానికి పోషణనందించి మృదువుగా మారుస్తాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ స్నానం చేసిన వెంటనే మోచేతులు, మోకాళ్లపై కాస్త కొబ్బరినూనె రాసుకొని రెండు నిమిషాల పాటు మర్దన చేసుకోవాలని తెలియజేస్తున్నారు. ఇలా రోజూ చేయడం వల్ల అక్కడి చర్మం మృదువుగా తయారవుతుందని పేర్కొంటున్నారు. కొబ్బరినూనెలో అర టీస్పూన్ నిమ్మరసం వేసి బాగా కలుపుకుని, ఆ మిశ్రమాన్ని మోచేతులకు రాసుకొని 15-20 నిమిషాల పాటు మర్దన చేసుకోవాలని తెలియజేస్తున్నారు. తర్వాత టిష్యూ పేపర్‌తో తుడిచేసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఇలా తరచూ చేస్తూ ఉంటే మోచేతులపై ఉన్న నలుపు క్రమంగా మాయమవుతుందని అంటున్నారు. నిమ్మ మంచి క్లెన్సర్‌గా పనిచేసి మృతకణాలను సమర్థంగా తొలగిస్తుందని చెబుతున్నారు. ఇందుకోసం నిమ్మచెక్కను తీసుకొని మోచేతులపై నలుపుగా ఉన్న చోట కాసేపు రుద్ది, ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకోవాలని పేర్కొంటున్నారు. ఇలా రెండు రోజులకోసారి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని అంటున్నారు. నిమ్మచెక్కను ఉప్పులో ముంచి రుద్దినా మోచేతులపై ఉన్న నలుపును తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ఒక గిన్నెలో రెండు టీస్పూన్ల పెరుగు, కొద్దిగా వైట్ వెనిగర్ తీసుకొని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని నల్లగా మారిన మోచేతులకు, మోకాళ్లకు రాసుకోవాలని అంటున్నారు నిపుణులు. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకుని, టవల్‌తో పొడిగా తుడుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే నలుపుదనం తగ్గుతుందని వివరిస్తున్నారు.

# వ్యవసాయశాఖలో జిప్సం దందా!



**అమరావతి, పతాకం న్యూస్:** రైతులు భూసారాన్ని సరిచేసుకొని అధిక పంట దిగుబడులు సాధించే సదుద్దేశంతో ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సూక్ష్మ పోషకాల్లో ఒకటైన జిప్సం దందా ప్రస్తుతం వ్యవసాయశాఖలో జోరుగా సాగుతోంది. బహిరంగ మార్కెట్‌లో 50 కిలోల జిప్సం బస్తా ధర రూ.140 పలుకుతుండగా, అదే పరిమాణంలో వ్యవసాయశాఖ రైతులకు పంపిణీ చేస్తున్న జిప్సం బస్తా ధర సబ్సిడీ పోను రూ.187 గా నిర్ణయించారు. మార్కెట్‌లో కంటే రూ.47 ఎక్కువ. కాగా మొత్తంగా వ్యవసాయశాఖ బస్తా జిప్సాన్ని ఎరువుల కంపెనీల నుంచి రూ.384 పై సమీకరించి, 50 శాతం సబ్సిడీ కింద రూ.187 తాను భరించి, రైతులకు రూ.187కు అమ్మకానికి పెట్టింది. మార్కెట్ ధర కంటే రూ.234 అధికంగా కోట్ చేసింది. ఆ విధంగా సేకరించిన జిప్సాన్ని మండల వ్యవసాయశాఖ అధికారుల (ఎఒ) కార్యాలయాల్లో, రైతు సేవా కేంద్రాల్లో అమ్మకానికి పెట్టింది. వైసిపి ప్రభుత్వం రైతులకు జింక్, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను రాయితీపై పంపిణీ చేయలేదని ఆరోపించిన టిడిపి కూటమి సర్కార్, 2025-26లో భూసార పరీక్షలు నిర్వహించి, వాటి నివేదికల ప్రాతిపదికన 15 లక్షల ఎకరాలకు సూక్ష్మ పోషకాలను పంపిణీ చేస్తామంటూ లక్ష్యాన్ని ప్రకటించింది. కేంద్ర పథకమైన జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) కింద వరి, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఇతర అపరాల పంటలకు అమలు పంపిణీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులు 60:40 నిష్పత్తిలో నిధులు వ్యయం చేస్తున్నారు. జింక్, బోరాన్‌లకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్నందున ప్రభుత్వ సేకరణ ధరలపై చర్చ లేదు. జిప్సానికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నందున ధరల తిరకాసు విస్తృతంగా చర్చనీయాంశమైంది. బహిరంగ మార్కెట్ ధర కంటే ప్రభుత్వ సరఫరా ధర ఎక్కువగా ఉండటంతో రైతులు ఆర్‌ఎస్‌కెలలో, ఎఒ కార్యాలయాల్లో జిప్సం కొనుగోలుకు ఇష్టపడట్లేదు. దాంతో నిల్వలు పేరుకుపోతున్నాయని క్షేత్రస్థాయి అధికారులు ఆవేదన చెందుతున్నారు.

చవుడు నేలలను సరి చేసేందుకు జిప్సాన్ని వేస్తారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూసార పరీక్షల ఫలితాలకనుగుణంగా గరిష్టంగా ఎకరానికి 4 బస్తాలు సిఫారసు చేస్తున్నారు. పంట ఎదుగుదల సమయంలో వేస్తే దిగుబడులు పెరుగుతాయని చెబుతున్నారు.

సబ్సిడీపై రైతులకు జిప్సం పంపిణీకి ఈ సంవత్సరం ఒక కంపెనీకే కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలిసింది. సదరు కంపెనీ బహిరంగ మార్కెట్‌లో 50 కిలోల బస్తాను రూ.140కి విక్రయిస్తోందని, అదే కంపెనీ అదే పరిమాణంలో జిప్సాన్ని రూ.374పై వ్యవసాయశాఖకు సరఫరా చేస్తోందని సమాచారం. మార్కెట్ ధర కంటే రూ.234 ఎక్కువ. ప్రభుత్వ టార్గెట్‌ననుసరించి లక్ష టన్నులను సరఫరా చేసినట్లయితే మార్కెట్ ధర కంటే రూ.46.80 కోట్లు ఎక్కువ కంపెనీకి చెల్లించాలి. వీటిలో రైతులు 9.40 కోట్లు, ప్రభుత్వం 37.40 కోట్లు పెట్టుకోవాలి. అన్ని లాభాలతో కలుపుకొని 28 కోట్ల విలువైన జిప్సం అమ్మకాల ద్వారా కంపెనీకి 46 కోట్లకు పైన లాభం వస్తుంది. ఇంత లాభం మరి దేంట్లోనూ రాదేమో! ఈ దందా వెనుక ప్రభుత్వంలోని కొందరు 'పెద్దల', ఉన్నతాధికారుల కమీషన్ల కక్కుర్తి, చేతివాటం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

# మంగోలియా సరిహద్దులో 100 ఖండాంతర క్షిపణులను మోహరించిన చైనా



**మాంగోలియా:** అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తించే రీతిలో చైనా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని శరవేగంగా విస్తరిస్తోంది. మంగోలియా సరిహద్దుకు సమీపంలో కొత్తగా నిర్మించిన మూడు క్షిపణి క్షేత్రాలలో (సైలో ఫీల్డ్స్) 100కి పైగా ఘన ఇంధన ఆధారిత డీఎఫ్-31ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను చైనా మోహరించినట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ రూపొందించిన ఒక ముసాయిదా నివేదిక వెల్లడించింది. గతంలో ఈ సైలో క్షేత్రాల నిర్మాణం గురించి పెంటగాన్ ప్రస్తావించినప్పటికీ, వాటిలో క్షిపణులను లోడ్ చేశారన్న విషయాన్ని బయటపెట్టడం ఇదే తొలిసారి. పెంటగాన్ నివేదిక ప్రకారం, చైనా తన అణు ఆయుధాగారాన్ని ఇతర అణ్వస్త్ర దేశాల కంటే వేగంగా విస్తరిస్తోంది, ఆధునికీకరిస్తోంది. 2024 నాటికి చైనా వద్ద సుమారు 600 అణు వార్‌హెడ్‌లు ఉండగా, 2030 నాటికి ఆ సంఖ్య 1,000 దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్షిపణి క్షేత్రాలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ నిర్వహిస్తోంది. డీఎఫ్-31 క్షిపణులు దాదాపు 11,700 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. అణ్వాయుధాల నియంత్రణకు సంబంధించిన చర్చల విషయంలో చైనా ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. "ఈ తరహా చర్యలు లేదా సమగ్ర అణ్వస్త్ర నియంత్రణ చర్చలు జరిపేందుకు బీజింగ్ వైపు నుంచి ఎలాంటి ఆసక్తి కనిపించడం లేదు," అని నివేదికలో పేర్కొన్నారు. 2026 ప్రారంభంలో అమెరికా-రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో చైనా విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల నవంబర్ 22న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా, రష్యాలతో నిరాయుధీకరణ చర్చలు జరిపే అవకాశం ఉందని సూచించడం గమనార్హం. అయితే, తమ అణ్వాయుధాల విస్తరణపై వస్తున్న ఈ నివేదికలను చైనా మొదటి నుంచి ఖండిస్తోంది. "ఇదంతా చైనాను అప్రతిష్టపాలు చేయడానికి, అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించడానికి చేస్తున్న దుష్ప్రచారమే," అని చైనా అధికారులు గతంలో పలుమార్లు ఆరోపించారు.




# గవాస్కర్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట... వ్యక్తిగత హక్కులకు రక్షణ



భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్‌కు ఢిల్లీ హైకోర్టులో మంగళవారం భారీ ఊరట లభించింది. గవాస్కర్ వ్యక్తిగత (పర్సనాలిటీ), ప్రచార (పబ్లిసిటీ) హక్కులను పరిరక్షిస్తూ ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. గవాస్కర్ పేరు, ఫోటో, ప్రతిష్ఠను దుర్వినియోగం చేస్తూ ఆన్‌లైన్‌లో ఉన్న అనధికారిక కంటెంట్, వస్తువులను వెంటనే తొలగించాలని సోషల్ మీడియా, ఈ-కామర్స్ వేదికలను ఆదేశించింది. జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. గవాస్కర్‌పై తప్పుడు వ్యాఖ్యలను ఆపాదిస్తూ ప్రచారంలో ఉన్న యూఆర్‌ఎల్‌లను 72 గంటల్లోగా తొలగించాలని మెటా, ఎక్స్ కార్ప్ వంటి సంస్థలను ఆదేశించింది. ఒకవేళ యూజర్లు ఆ కంటెంట్‌ను తొలగించడంలో విఫలమైతే, సంబంధిత సోషల్ మీడియా సంస్థలే వాటిని నిలిపివేయాలని స్పష్టం చేసింది. అలాగే, గవాస్కర్ పేరుతో అనధికారికంగా విక్రయిస్తున్న నకిలీ ఆటోగ్రాఫ్‌లు, ఇతర వస్తువుల లిస్టింగ్‌లను కూడా తొలగించాలని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు సూచించింది. సోషల్ మీడియాలో కొందరు తనకు సంబంధం లేని వ్యాఖ్యలను ఆపాదిస్తున్నారని, ఆన్‌లైన్‌లో తన పేరుతో నకిలీ వస్తువులను అమ్ముతున్నారని ఆరోపిస్తూ సునీల్ గవాస్కర్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కాలంలో పలువురు ప్రముఖులు తమ పర్సనాలిటీ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తున్నారు.

# మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు భారీగా పెంపు




దేశవాళీ క్రికెట్‌లో మహిళా క్రికెటర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా క్రికెటర్లు, మ్యాచ్ అధికారుల ఫీజులను రెట్టింపుకన్నా ఎక్కువగా పెంచింది. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న అమ్మాయిల ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. ఇటీవల భారత్ తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకోవడం చారిత్రక ఘట్టంగా నిలిచిన నేపథ్యంలో కీలక నిర్ణయాన్ని బీసీసీఐ తీసుకుంది. ఈ పెంపుదలను బోర్డు అపెక్స్ కౌన్సిల్ అధికారికంగా ఆమోదం తెలిపింది. సవరించిన చెల్లింపు విధానం ప్రకారం మహిళల దేశవాళీ టోర్నీల్లో పాల్గొనే ఆటగాళ్లకు భారీగా ఫీజులు పెరిగాయి. సీనియర్ మహిళల దేశవాళీ వన్డే టోర్నమెంట్‌తో పాటు బహుళ రోజుల టోర్నీల్లో తుది జట్టులో చోటు దక్కించుకున్న ప్లేయర్లకు రోజుకు రూ.50 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇప్పటివరకు ఈ ఫీజు కేవలం రూ.20 వేలు మాత్రమే ఉండేది. ఇక రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు అందించనున్నారు. అంటే గతంతో పోలిస్తే రెట్టింపుకు పైగా పెరుగుదల నమోదైంది.

అలాగే జాతీయ స్థాయి మహిళల టీ20 టోర్నీల్లోనూ ఫీజులు గణనీయంగా పెరిగాయి. ఈ టోర్నీల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లిస్తారు. రిజర్వ్‌లకు రోజుకు రూ.12,500 ఇవ్వనున్నారు. ఈ విధంగా అన్ని ఫార్మాట్లలో ఆడే అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లు ఒక సీజన్‌లో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇది మహిళా క్రికెటర్లకు పెద్ద ఊరటగా మారనుంది.

యువ క్రికెటర్లను కూడా బీసీసీఐ మర్చిపోలేదు. అండర్-23, అండర్-19 విభాగాల్లో ఆడే మహిళా క్రికెటర్లకు కూడా మ్యాచ్ ఫీజులు పెంచింది. ఈ విభాగాల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లించనున్నారు. రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.12,500 అందిస్తారు. చిన్న వయసులోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుంటున్న అమ్మాయిలకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో కీలక పాత్ర పోషించే మ్యాచ్ అధికారుల ఆదాయాన్ని కూడా బీసీసీఐ పెంచింది. అంపైర్లు, రిఫరీలకు రోజుకు రూ.40 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇక నాకౌట్ మ్యాచ్‌లకు అయితే మ్యాచ్ ప్రాధాన్యతను బట్టి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజు ఉంటుంది. దీని ప్రకారం ఒక అంపైర్ రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌కు సుమారు రూ.1.60 లక్షలు సంపాదిస్తారు. అదే నాకౌట్ మ్యాచ్‌లకు అయితే రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్జించే అవకాశం ఉంటుంది.

మొత్తంగా చూస్తే మహిళల క్రికెట్‌కు బీసీసీఐ పెద్ద పీట వేస్తున్నట్లు ఈ నిర్ణయం స్పష్టంగా చెబుతోంది. మ్యాచ్ ఫీజుల పెంపుతో మహిళా క్రికెటర్లకు ఆర్థిక భరోసా పెరగడమే కాకుండా, దేశవాళీ స్థాయిలో మరిన్ని యువతులు క్రికెట్ వైపు ఆకర్షితులయ్యే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. మహిళల ప్రపంచకప్ విజయం తర్వాత తీసుకున్న ఈ నిర్ణయం, భారత మహిళల క్రికెట్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# 'మా బాడీ మా ఇష్టం' అంటున్న అనసూయ

నటుడు శివాజీ తన తాజా చిత్రం 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారి తీశాయి. నిన్న రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన నేటితరం హీరోయిన్ల గ్లామర్ ప్రదర్శనపై ఘాటు వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. మహిళల అందం చీరలోనే ఇమిడి ఉందని, అభ్యంతరకరంగా దుస్తులు ధరిస్తే అందులో విలువ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

అంతేకాకుండా పొట్టి బట్టలు వేసుకున్న హీరోయిన్లను బయట పొగిడినా, లోపల మాత్రం అసహ్యించుకుంటారని చెప్పేందుకు శివాజీ కొన్ని అభ్యంతరకర పదాలను ఉదాహరణగా వాడటం తీవ్ర విమర్శలకు కారణమైంది. సావిత్రి, సౌందర్య వంటి మహానటులను ఆదర్శంగా తీసుకోవాలని, గ్లామర్‌కు ఒక హద్దు ఉండాలంటూ ఆయన హితవు పలికారు. అయితే, ఈ వ్యాఖ్యలు మహిళల వ్యక్తిగత స్వేచ్ఛపై దాడిగా భావిస్తూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.




ఈ అంశంపై ఇప్పటికే గాయని చిన్మయి స్పందించగా, తాజాగా యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ కూడా శివాజీ వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన అనసూయ, "ఇది మా శరీరం.. మీది కాదు. మాకు నచ్చినట్లే మేము ఉంటాం" అంటూ స్పష్టం చేశారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో ఇతరులు జోక్యం చేసుకోవడం తగదనే అర్థం వచ్చేలా ఆమె తన సోషల్ మీడియాలో పోస్టులో పేర్కొన్నారు.

ఈ వివాదం ద్వారా సినీ పరిశ్రమలో మహిళలపై వ్యాఖ్యలు, వారి స్వేచ్ఛ, వ్యక్తిగత ఎంపికలపై మరోసారి పెద్ద చర్చ మొదలైంది. సమాజంలో మారుతున్న ఆలోచనలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన వ్యాఖ్యలు అవసరమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# గూస్ బంప్స్ తెప్పిస్తున్న 'రౌడీ జనార్ధన' గ్లింప్స్

విజయ్ దేవరకొండ – రవికిరణ్ కోలా కాంబోలో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్దన' సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో సోమవారం ఈవెంట్ నిర్వహించిన మేకర్స్ ఈ వీడియోను విడుదల చేశారు. ఈ ఈవెంట్‌లో డైరెక్టర్ రవి కిరణ్, ప్రొడ్యూసర్ దిల్‌రాజు హాజరయ్యారు.



'బండెడు అన్నం తిని కుండెడు రక్తం తాదే రాక్షసుడి కథ ఎప్పుడైనా విన్నావా?' అనే డైలాగ్?తో గ్లింప్స్ మొదలైంది. గ్లింప్స్ చూస్తుంటే విజయ్ ఇప్పటివరకు టచ్ చేయని జాన్రాలో ఇది తెరకెక్కుతుందని అర్థమవుతోంది. ఇందులో విజయ్ క్యారెక్టర్ ఫుల్ వైలెంట్‌గా ఉండనున్నట్లు ఈ గ్లింప్స్‌తో క్లారిటీ వచ్చేసింది.'కొమ్ములు తిరిగిన రాక్షసులు, రక్తానికి మరిగిన రౌడీలు' అనే డైలాగులు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. రాయలసీమలోని కలింగపట్నం అనే విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా సాగనుంది.

'కలింగపట్నంలో ప్రతీ ఒక్కడు నేను రౌడీ అని చెప్పుకొని తిరుగుతాడు, కానీ ఇంటిపేరనే రౌడీగా మార్చుకున్నోడు ఒక్కడే ఉన్నాడు. జనార్ధన, రౌడీ జనార్ధన' అనే పవర్ఫుల్ డైలాగ్‌తో విజయ్ పూనకాలు తెప్పిస్తున్నారు. ఇన్ని రోజులు విజయ్‌ను లవర్‌బాయ్‌గా చూసిన ఫ్యాన్స్ ఈ సినిమాతో ఆయనలోని మాస్ విశ్వరూపం చూడనున్నారు. క్రిస్టో జేవియర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది.






# క్రిస్మస్‌కు డబ్బింగ్ చిత్రాలతో సహా 7 సినిమాలు బరిలోకి




మరికొన్ని రోజుల్లో 2025 ముగుస్తున్న వేళ ఈ ఏడాదిలో తెలుగు సినీ పరిశ్రమలో చెప్పుకోదగ్గ సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద అంతగా ఆడలేదు. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా బరిలోకి వచ్చిన తర్వాత అఖండ-2 తాండవం తప్ప వేరే ఏ చిత్రాలు భారీ రెస్పాన్స్‌ను దక్కించుకోలేకపోయాయి. దీంతో ఈ సంవత్సరం నిరాశాజనకంగా ముగుస్తుందా అనుకునేలోపే సరికొత్త కథనాలతో క్రిస్మస్? సందర్భంగా కొన్ని సినిమాలు రిలీజ్ కాబోతున్నాయి.

ఆ చిత్రాలు థియేటర్లలో మంచి రెస్పాన్స్ అందుకుంటాయని టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు ఆశిస్తున్నాయి. డబ్బింగ్ చిత్రాలతో కలుపుకుని రాబోయే క్రిస్మస్ వేడుకకు మొత్తం 7 సినిమాలు బరిలోకి దిగనున్నాయి. దీంతో ఈ చిత్రాలు రాబోయే న్యూయర్? ఈవెంట్? వరకు బాక్సాఫీస్? వద్ద భారీ వసూళ్లను రాబట్టాలని సినీ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ క్రిస్మస్‌కి ఛాంపియన్, శంబాల, దండోరా, పతంగ్?, ఈషా బాక్సాఫీస్ వద్ద వాటి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. వీటితో పాటు డబ్బింగ్ సినిమాలైన వృషభ, మార్క్ వీటితో పోటీ పడనున్నాయి. ఈ చిత్రాలైన థియేటర్లలో మంచి పేరును సంపాదిస్తే రెండు వారాలతో పాటు సంక్రాంతి వరకు మంచి లాభాలను అందిస్తాయని సినీ వర్గాలు భావిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**